తార్నాకలో శతరుద్ర చండీ యాగం


చండీ యాగంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి

లాలాపేట: ప్రముఖ పురోహితులు సతీష్ శర్మ ఆధ్వర్యంలో తార్నాకలోని నాగార్జున నగర్ కమ్యునిటీహాల్ ఆవరణలో మూడు రోజుల పాటు శతరుద్ర సహిత శత చండీ యాగము నిర్వహిస్తున్నారు. మొదటి రోజు శుక్రవారం యాగము ప్రారంభోత్సవ కార్యక్రమానికి జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి దంపతులు హాజరయ్యారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ లోక కళ్యాణార్థం తలపెట్టిన ఈ యాగము దిగ్విజయంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ఉమ

లాలాపేట: ఐఎస్ఓ జూనియర్ కాలేజ్ ఆధ్వర్యంలో శుక్రవారం తార్నాకలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఇదే కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ చదువుతున్న విద్యార్థులు ఈ వైద్య శిబిరం ద్వారా స్థానికులకు బీపి, షుగర్, బ్లడ్ గ్రూపింగ్, డయాబెటిక్ చెకప్, డైట్ బ్యాలెన్స్ కౌన్సిలింగ్ వంటి సేవలను అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమా తదితరులు పాల్గొన్నారు.

కార్గిల్ వీరుడికి ఘననివాళి



రసూల్‌పురా: కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన లాన్స్‌నాయక్ ఎంవై. రాంచందర్‌కు పలువురు నివాళులర్పించారు. బొల్లారంలోని రాంచందర్ విగ్రహానికి శుక్రవారం పీసీసీ కార్యదర్శి డాక్టర్ నరసింహన్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించి దేశం కోసం ఆయన చేసిన త్యాగాన్ని కొనియాడారు. వివాహం జరిగి రెండునెలల అయినా ఉన్నతాధికారుల పిలుపు మేరకు యుద్ధంలో పాల్గొని శత్రుమూకలను తుదముట్టించి వీరమరణం పొందాడని నరసింహన్ తెలిపారు. రాంచందర్ విగ్రహం ఏర్పాటు చేసి ప్రతి కార్గిల్ దివస్ రోజు నివాళుల ర్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాల్‌రాజు, సతీష్, సుశీల్, భీమన్న, ఎల్లయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్నా అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలనీ తెలంగాణ రీసెర్చ్ స్కాలర్స్ ప్రసిడెంట్ డా. ప్రేమ్‌కుమార్ శుక్రవారం పేర్కొన్నారు. యూనివర్సిటీల్లో అధ్యాపకుల కొరత వలన నాణ్యతా ప్రమాణాలతో కూడిన బోధన, పరిశోధనలు కుంటుపడ్డాయన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా డిగ్రీ, ఇంటర్ కాలేజీల్లో పని చేస్తున్న గెస్ట్ లెక్చరర్స్ వేతనాలు పెంచుతూ కన్సాలిడేటెడ్ పేమెంట్ పాటు ఉద్యోగ భద్రత కల్పించాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సదస్సును విజయవంతం చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ విద్యావంతుల వేదిక (టీవీవీ) ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహించతలపెట్టిన సదస్సును జయప్రదం చేయాలనీ టీవీవీ ఉపాధ్యక్షులు డా. ఇనుప ఉపేందర్ విజ్ఞప్తి చేశారు. ఆర్ట్స్ కళాశాల ఎదుట సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేరాల నివారణపై దృష్టి సారించండి


పోలీస్ స్టేషన్‌లో పోలీసు అధికారులతో మాట్లాడుతున్న డీసీపీ


రాంగోపాల్‌పేట్: ఉత్తర మండలం డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ శుక్రవారం మార్కెట్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను ఆమె పరిశీలించి కేసుల వివరాలను ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. నేరాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అసాంఘిక కార్యకలాపాలను నియంత్రిస్తాం


గాంధీ సూపరింటెండెంట్‌ను అభినందిస్తున్న ఇన్‌స్పెక్టర్ అనుదీప్

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయనున్నట్లు చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తెలిపారు. గాంధీ సూపరింటెండెంట్‌గా నూతనంగా పదవీబాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ రాజకుమారిని శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశార. రోగులకు చెందిన సెల్‌ఫోన్లు, నగదు, వైద్యులకు చెందిన ల్యాప్‌టాప్‌లు ఇతర విలువైన వస్తువులు చోరీలకు గురికాకుండా మరింత కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేపట్టామన్నారు.

వ్యక్తి అదృశ్యం


అబ్దుల్ అహద్ (ఫైల్)

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్సై నరేష్ శుక్రవారం తెలిపిన మేరకు.. తార్నాక విజయపురి కాలనీలో నివాసం ఉండే సయ్యద్ అబ్దుల్ అహద్(56)కు కొంత కాలంగా మతిస్థిమితి సరిగ్గా లేదు. ఈ నెల 25న ఉదయం కుటుంబ సభ్యులు నిద్రలేచే సరికి అతను ఇంట్లో నుంచి చెప్పా పెట్టకుండా వెళ్లిపోయాడు. దీంతో అతని భార్య ఫాతిమా ఓయూ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోనాలకు సర్వం సిద్ధం

రేపటి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి


బోనాల ఉత్సవాలకు ముస్తాబైన బేగంపేట కట్టమైసమ్మ అమ్మవారు


విద్యుద్దీపాలతో ధగధగలాడుతున్న సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం

సనత్‌నగర్: ఈ నెల 28న ఆషాఢమాసం నాలుగో ఆదివారం నిర్వహించే బోనాల జాతరకు అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా దేవాలయ కమిటీల ప్రతినిధులు, దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు భద్రతాపరంగా ఎలాంటి లోపాలు జరక్కుండా ఉండేలా ప్రధాన ఆలయాల్లో సీసీ కెమెరాల ద్వారా పోలీసులు నిఘా ఉంచనున్నారు. బోనాల మహోత్సవాల నేపథ్యంలో ఆలయాలు విద్యుద్దీపాలతో శోభయామానంగా వెలుగొందుతున్నాయి. సనత్‌నగర్ డివిజన్‌లో 18 ఆలయాలు, అమీర్‌పేట డివిజన్‌లో 21, బేగంపేట డివిజన్‌లో 37 ఆలయాల్లో బోనాల ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మరోవైపు ప్రభుత్వం తరుపున అమ్మవారి ఆలయాలను అందంగా అలంకరించే నేపథ్యంలో ప్రత్యేక నిధులు కూడా మంజూరు చేశారు. ఇప్పటికే మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆయా ఆలయ కమిటీలకు నిధులకు సంబంధించిన చెక్కులను అందజేశారు. ఆయా నిధులతో ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

- సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలో గ్రామదేవత పోచమ్మ అమ్మవారికి బోనాల జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. జాతరలో భాగంగా ఆదివారం ఉదయం 6 గంటలకు అమ్మవారికి పాలాభిషేకం, 7 గంటలకు పుష్పాలంకరణ, బోనాల సమర్పణ, 11 గంటలకు అమ్మవారి ఘటం ఊరేగింపు, రాత్రి 9 గంటలకు బలిహరణ జరుగుతుందని ఈఓ శ్రీనివాసరాజు తెలిపారు.
- బేగంపేట్ శ్రీకట్టమైసమ్మ మహాలక్ష్మి అమ్మవారి బోనాలకు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటలకు సర్వజన దర్శనం, ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు అమ్మవారికి బోనాల సమర్పణ ఉంటుందని ఆలయ ఫౌండర్ ట్రస్టీ చెక్కల సుభాష్‌ముదిరాజ్ తెలిపారు.


బోనాల ఉత్సవాలకు ముస్తాబైన బేగంపేట్ ప్రకాష్‌నగర్ భూలక్ష్మీ అమ్మవారి ఆలయం

- బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలోని భూలక్ష్మీ అమ్మవారి ఆలయానికి రంగులు వేసి విద్యుద్దీప కాంతులతో అలంకరించినట్లు ఆలయ ధర్మకర్త విశాల్ సూదం తెలిపారు.
- ఈఎస్ఐ ఆస్పత్రి ఆవరణలోని బంగారు మైసమ్మ ఆలయం బోనాల ఉత్సవాలకు ముస్తాబైంది. ఉత్సవాలకు ఈఎస్ఐ వైద్యాధికారులతో పాటు పలువురు రాజకీయ నేతలు హాజరుకానున్నట్లు ఆలయ చైర్మన్ మనోహర్ తెలిపారు.
- అమీర్‌పేటలోని లక్ష్మీదుర్గా సోనాబాయి ఆలయంలో ఏటా నిర్వహించే రంగం కార్యక్రమం ప్రత్యేకతను చాటుతోంది. బోనాల ఉత్సవాల అనంతరం సోమవారం ఆలయ ముందు నిర్వహించే రంగంలో కుండపై నిలబడే మహిళ భవిష్యవాణి చెప్పే కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంటోంది.

పార్టీ బలోపేతానికి పాటుపడాలి


సమావేశంలో మాట్లాడుతున్న సారంగపాణి

లాలాపేట: బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు అందరూ పాటుపడాలనీ బీజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. శుక్రవారం తార్నాక డివిజన్ బిజేపి అధ్యక్షుడు రాము వర్మ ఆధ్వర్యంలో డివిజన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లే కార్యక్రమాలు చేపట్టాలనీ సూచించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో వెంకటేష్‌గౌడ్, పోచయ్యయాదవ్,సుబ్బారావు, అనిత, ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు.

స్కందగిరి దేవాలయం మేనేజర్ హఠాన్మరణం


స్వామినాథన్ సురేష్

పద్మారావునగర్: సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని సుప్రసిద్ధమైన స్కందగిరి శ్రీ సుబ్రమణ్యంస్వామి దేవాలయం అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ స్వామినాథన్ సురేష్(57) మరణించారు. శుక్రవారం ఉదయం మల్కాజిగిరిలోని తన నివాస గృహంలో గుండెపోటుతో కన్నుమూశారు. గత 12 సంవత్సరాల నుంచి దేవాలయంలో పరిపాలన విభాగం మేనేజర్‌గా సురేష్ విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకున్నారు. సురేష్ మరణం పట్ల ఆలయ మేనేజింగ్ ట్రస్టీ కృష్ణన్ రాజమణి, ఆలయ పీఆర్వో రాంబాబు, సెక్యూరిటీ చీఫ్ బుగ్గయ్య, ఆలయ అర్చకులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. స్వామినాథన్ సురేష్‌కు భార్య, కుమార్తె ఉన్నారు.

ప్రధాని దిష్టిబొమ్మ దహనం


నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

సనత్‌నగర్: బీజేపీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నేతలు శుక్రవారం అమీర్‌పేట సత్యం టాకీస్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. టీపీసీసీ జనరల్ సెక్రటరీ కోట నీలిమ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. కాంగ్రెస్ నేతలు శ్రీనివాసరావు, రవీందర్, నవీన్ రాజు, గోపాల్, నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఫ్రెషర్స్ డే వేడుకల్లో గొడవ

- ఇంటర్ సీనియర్ విద్యార్థులపై జూనియర్స్ దాడి..
- నలుగురు విద్యార్థులు గాంధీకి తరలింపు

సనత్‌నగర్: సికింద్రాబాద్ అవినాష్ కాలేజ్ విద్యార్థుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహిస్తుండగా విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలోఓ పలువురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సికింద్రాబాద్ ఎస్‌డీ రోడ్డులోని అవినాష్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు గురువారం రాత్రి బేగంపేట రసూల్‌పురాలోని క్లాసిక్‌గార్డెన్స్‌లో ఫ్రెషర్స్ డే ఉత్సవాలు జరుపుకున్నారు. స్టేజీపై డ్యాన్స్‌లు చేస్తున్న క్రమంలో జూనియర్స్, సీనియర్స్ మధ్య తగదా వచ్చి గొడవ పడ్డారు. అనంతరం గార్డెన్స్ బయటకు వచ్చాక జూనియర్ విద్యార్థులు సీనియర్లపై దాడుల చేశారు. ఈ ఘటనలో గాయపడిన నలుగురు విద్యార్థులను చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. దాడి చేసిన వారిలో నలుగురు విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ఐయామ్ వాట్ ఐయామ్' పుస్తకావిష్కరణ



సనత్‌నగర్: పద్మశ్రీ అవార్డు గ్రహీత సునీత కృష్ణన్ రచించిన 'ఐయామ్ వాట్ ఐయామ్' అనే ఆటోబయోగ్రఫీ పుస్తకాన్ని మంత్రి సీతక్క ఆవిష్కరించారు. శుక్రవారం సాయంత్రం అమీర్‌పేటలోని గ్రీన్‌పార్క్ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉమెన్ ట్రాఫికింగ్‌లో ఇరుక్కున్న ఎంతోమంది ఆడబిడ్డలను సునీత కృష్ణన్.అధికారులు పోరాడి వారిని కాపాడారని మంత్రి పేర్కొన్నారు. ఐపీఎస్ అధికారి అమిత్‌గార్గ్ ,అదనపు డీజీ మహేష్ భగవత్, సీనియర్ జర్నలిస్ట్ స్వప్న పాల్గొన్నారు.

శాకాంబరిగా అమ్మవారు

సనత్‌నగర్: తులసీనగర్‌లో కొలువుదీరిన శ్రీకనకదుర్గమ్మ అమ్మవారిని శుక్రవారం శాకాంబరిగా అలంకరించారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మహిళలు సౌందర్య లహరి లలిత సహస్రనామ పారాయణం చేశారు. తులసీనగర్ బస్తీతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలోల్లో...) టమాటా రూ.39, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 48, క్యాప్సికమ్ 47, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 21, క్యారెట్ 42, దొండ 28, గుండుబీన్స్ 70, గింజ చిక్కుడు 65, గోకరకాయ 35, కీర 21, దోసకాయ 18, బీట్‌రూట్ 32, ఉల్లిగడ్డ 34, ఆలుగడ్డ 40, చామగడ్డ 40, మొరంగడ్డ 40, కందగడ్డ 50, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.


బొడ్రాయి ఉత్సవాలు ప్రారంభం

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలో శీతలాదేవి బొడ్రాయి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు కొనసాగే ఈ ఉత్సవాల్లో మొదటి రోజు బొడ్రాయి అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని బొడ్రాయికి జలాభిషేకంతో ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్సీ ఎస్. రామ్ చందర్‌రావు, బొడ్రాయి ఉత్సవ కమిటీ నాయకులు వంజరి ముత్తయ్య పాల్గొన్నారు.

మారేడుపల్లి తహసీల్దార్‌గా భీమయ్య గౌడ్

అడ్డగుట్ట: మారేడుపల్లి మండల తహసీల్దార్‌గా భీమయ్య గౌడ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు అమీర్‌పేట్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు తెలిపారు. అదే విధంగా బదిలీపై వెళ్తున్న డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్, సీనియర్ అసిస్టెంట్ మల్లీశ్వర్‌రెడ్డిలను శాలువాలతో సత్కరించారు.

కళాసీగూడ ముత్యాలమ్మకు వెండి ఘటం అందజేత



రాంగోపాల్‌పేట్: కళాసీగూడ ముత్యాలమ్మకు భక్తులు వెండి ఘటాన్ని బహూకరించారు. స్థానికంగా ఉండే వేంపటి విక్రాంత్, శ్రవణ్‌ల కుటుంబ అమ్మవారికి ఈ వెండి ఘటాన్ని అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు దీన్ని అందించారు.

మార్కెట్లోకి 'సెకిటో' పురుగుల మందు



సాక్షి, సిటీబ్యూరో: భారతీయ బహుళజాతి సంస్థ యూపీఎల్ ఎస్ఏఎస్ లిమిటెడ్ అంతర్జాతీయ ప్రమాణాలతో నూతన క్రిమి సంహార విశిష్ట సస్యరక్షణ ఉత్పాదన అయిన సెకిటో పురుగుల మందును మార్కెట్‌లోకి విడుదల చేశారు. శుక్రవారం బేగంపేటలో జరిగిన ఈ కార్యక్రమంలో కంపెనీ ఇండియా సీఈఓ అషిష్ ధోబాల్, ఇండియా మార్కెటింగ్ హెడ్ ప్రతాప్ రాంకంభ్ తదితరులు పాల్గొన్నారు.

చిలకలగూడ బోనాల జాతర ప్రారంభం


అమ్మవారికి వడిబియ్యం సమర్పిస్తున్న మహిళలు

చిలకలగూడ : చిలకలగూడ కట్టమైసమ్మ, నల్ల పోచమ్మ ఆలయ ప్రాంగణంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో వడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయం వద్ద పెద్ద సంఖ్యలో బారులు తీరిన భక్తులు అమ్మవారికి వడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం ఉదయం బోనాలు, సాయంత్రం ఫలహారం బళ్లు, తొట్టెల ఊరేగింపు, సోమవారం భవిష్యవాణి (రంగం) కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మహేందర్‌గౌడ్, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ గుంటి కృష్ణ, ప్రధాన అర్చకులు తిరుమలా చార్యులు తెలిపారు. ఆది, సోమవారాలో మంచినీటి సరఫరా చేస్తామని, చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయం వద్ద ఉచిత వాటర్ ప్యాకెట్లు స్టాల్ ఏర్పాటు చేయనున్నట్లు జలమండలి అధికారులు తెలిపారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో ఉంచారు. చిలకలగూడ ఠాణా పరిధిలోని పలు అమ్మవారి ఆలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేపట్టామని చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తెలిపారు.

ఘనంగా విజయ్ దివస్


విద్యార్థుల నృత్య ప్రదర్శన

రసూల్‌పురా: కార్గిల్ విజయ్ దివస్ రజతోత్సవం పురస్కరించుకుని వన్ (టి) ఆర్మర్డ్ స్క్వాడ్రన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ సెయింట్ మేరీ డిగ్రీ కళశాలలో కార్గిల్ విజయ దివస్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్మర్డ్ స్క్వాడ్రన్ ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి కల్నల్ వైభవ్ గుప్త ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు కార్గిల్ యుద్ధ విశేషాలను ఉద్వేగభరితంగా వివరించారు. కార్యక్రమంలో సేయింట్ మేరీస్ కళశాల ప్రిన్సిపల్ ఆంతోని విజయ్, ఎన్‌సీసీ క్యాడేట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనం నడిపితే చర్యలు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్ రాజు

రసూల్‌పురా: ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా మైనర్లు వాహనం నడిపితే చట్టరీత్యా నేరమని వారితో పాటు తల్లిదండ్రులు కూడా జైలుకు వెళతారని బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ ఇన్స్టిట్యూట్ ఏసీపీ జి. శంకర్ రాజు పేర్కొన్నారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు నివారణ అంశంపై పవర్‌పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముందు కార్గిల్ యుద్ధం ఏ విధంగా జరిగింది తెలుపుతూ పాకిస్తాన్ సైనికుల దురగాతాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఐరీన్ సుప్రద, ఉపాధ్యాయులుగణేష్, భాస్కర్ గౌడ్, ప్రభాకర్, పద్మజ, విద్య తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో మహంకాళి జాతర

రాంగోపాల్‌పేట్: అన్ని శాఖల అధికారులు, వాలంటీర్లు, భక్తులందరి సహకారంతో సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి జాతర విజయవంతమైందని ఆలయ ఈవో గుత్త మనోహర్‌రెడ్డి అన్నారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ సురిటి కామేష్‌తో కలిసి ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఘటోత్సవం నుంచి రంగం వరకు సుమారు 20 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని తెలిపారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కమిషనర్ హన్మంతరావులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఏర్పాట్లలో పాలుపంచుకున్నారని అన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం

సనత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేద ప్రజలు, నిరుద్యోగులకు చేసిందేమీ లేదని ఆరోపిస్తూ సనత్‌నగర్ నియోజకవర్గం బీజేపీ నేతలు శుక్రవారం అమీర్‌పేటలో ఆందోళన నిర్వహించారు. ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను ఊరేగిస్తూ సత్యం థియేటర్ చౌరస్తాలో దహనం చేశారు. అమీర్‌పేట కార్పొరేటర్ కేతినేని సరళ, బీజేపీ సీనియర్ నాయకులు వెల్లాల రామ్మోహన్, దయానంద్ తదితరుల ఆధ్వర్యంలో నేతలు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తంచేశారు.

వ్యక్తిపై దాడి.. ఫోన్, నగదు లాక్కొని పరార్

సనత్‌నగర్: మూత విసర్జన చేస్తున్న వ్యక్తిపై దాడికి పాల్పడిన ముగ్గురు అగంతకులు అతని వద్ద సెల్‌ఫోన్, నగదు తీసుకుని పరారయ్యారు. ఈ సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. రసూల్‌పురా ఇందిరమ్మనగర్‌కు చెందిన అర్బింద్ పాశ్వాన్ ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్నాడు. రోజువారీ విధులు ముగించుకుని సుచిత్ర వద్ద బస్సు ఎక్కి రాత్రి 10.45 గంటలకు ప్యారడైజ్ సమీపంలోని ప్లాజా వద్ద బస్సు దిగాడు. ప్లాజా జంక్షన్ సమీపంలో మూత్ర విసర్జన చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు అతన్ని అడ్డగించారు. అకారణంగా దాడి చేసి ముఖం, కర్రలతో తీవ్రంగా కొట్టారు. బాధితుడి వద్ద సెల్‌ఫోన్, రూ.వెయ్యి నగదు, ఏటీఎం కార్డు, బస్సు పాసును తీసుకుని ఉడాయించారు. బాధితుడు బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

రసూల్‌పురా : మాదకద్రవ్యాలు కేంద్ర నాడీ వ్యవస్థపై పని చేసి మెదడుతో పాటు శరీర అవయవాలపై ప్రభావం చూపిస్తాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్యారసాని రాంకుమార్ చెప్పారు. శుక్రవారం తిరుమలగిరి లాల్‌బజార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన రాంకుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను నిరంతరం గమనించాలని చెడు వ్యసనాలకు లోను కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గాంధీ హస్పిటల్ ప్రో. రమాదేవి, ప్రధానపోధ్యాయులు రమణ మూర్తి, అనిత, మోహన్‌దాస్, సునిత తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న రాంకుమార్
